
క్లుప్తంగా

## ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి


ధనమ్మ తల్లి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలో కొలువైన ధనమ్మ తల్లి ఆలయాన్ని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సెలవు దినం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, దూరపు ప్రాంతాల పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో ధనమ్మ మర్రిని సందర్శించారు. అమ్మవారికి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

## ఘనంగా సోమేశ్వర స్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కె.గంగవరం: మండల పరిధిలోని యండగండిలో రాజరాజేశ్వరి సమేత సోమేశ్వర స్వామి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద వేద పండితులు పలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. కల్యాణం సందర్భంగా స్వామి వారు, అమ్మవారితో పాటు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు.

## 270 మందికి ఉచిత వైద్య సేవలు


అంగర శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 270 మందికి ఉచిత వైద్య సేవలందించారు. చిలుకూరి మాచరయ్య, సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు కైలాస్‌పతి, పద్మావతి దంపతులు ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన కాపిటల్ హాస్పిటల్ వైద్యులు వైద్య సేవలందించారు. నిర్వాహకుల మనుమలు, మనుమరాళ్లు అయిన వైద్యులు ఎస్.సత్యసందీప్, ఎస్.జ్యోతిర్మయి, ఎస్ఎస్ నితిన్, ఎస్.సారూప్య స్త్రీల ప్రత్యేక వైద్య సమస్యలు, చిన్నారుల సమస్యలపై పరీక్షలు చేశారు. రూ.2.50 లక్షలు విలువైన మందులను ఉచితంగా అందజేశారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే


విద్యుత్ పొయ్యిని అందిస్తున్న వైస్ ఎంపీపీ రాజ్యలక్ష్మి తదితరులు

రామచంద్రపురం రూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వరహాలక్ష్మి ఆధ్వర్యంలో ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ అధ్యక్షతన గ్రామంలోని 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ పొయ్యి అందజేశారు. వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీ సూర్యవతి, సెక్రటరీలు పీ సత్యనారాయణ, అడపా వెంకట్రావు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో సేవలందించండి


మండపేటలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏఎంసీ ప్రతినిధులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రతినిధులుగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. మండపేటలోని సూర్య ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏఎంసీ పాలకవర్గం ప్రతినిధులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరైన ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్‌గా మండపేట మండలం చిన ద్వారపూడికి చెందిన చింతపల్లి రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన మోటిపల్లి బాపిరాజు, 18 మంది డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి పీవీఎస్ సుబ్బరాజు, రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రు శ్రీవరప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ వీవీవీఎస్ చౌదరి, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# బడి పిల్లలకు మ్యాపింగ్ గండం

- బడి పిల్లలను ప్రమాదంలోకి నెడుతున్న కూటమి ప్రభుత్వం
- రెండు కిలోమీటర్లలోపు పాఠశాల విద్యార్థుల మ్యాపింగ్
- దూరాన ఉన్న పాఠశాలలకు వెళ్లాలంటున్న అధికారులు
- తమ పిల్లల ప్రాణాలను పణంగా పెట్టలేమంటున్న తల్లిదండ్రులు


ఈ నెల 20న ఇకపిలేశ్వరపురం మండల సమావేశంలో తమ సమస్యను వివరిస్తున్న తల్లులు (ఫైల్)

కపిలేశ్వరపురం: విద్యా వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని, అంతర్జాతీయ స్థాయిలో మన పిల్లలు వివిధ రంగాల్లో రాణించేస్తారంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటనలు గుప్పిస్తున్నారు. దానికోసం దేశ విదేశీ నిపుణులతో చర్చలు జరుపుతున్నామంటూ అరచేతిలో స్వర్గాన్ని చూపిస్తున్నారు. అలా జరిగితే అందరూ సంతోషిస్తారు. నిజానికి క్షేత్ర స్థాయిలోని పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంది. కూటమి పాలన వచ్చిన ఏడాది కాలంలో విద్యారంగానికి చేసిన ఖర్చు పరిమితం. ఇవన్నీ చాలవన్నట్టు పాఠశాల విద్యార్థుల మ్యాపింగ్ ప్రక్రియ సమస్యలను తెచ్చిపెడుతోంది. రెండు కిలోమీటర్లలోపు ఉన్న ఏ రెండు పాఠశాల్లోని ఉన్నత తరగతి పిల్లలను ఏదో ఒక పాఠశాలలో మ్యాపింగ్ చేయమని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. అందుకు ఎంఈఓలు తగిన ప్రణాళికను ఉన్నతాధికారులకు నివేదించగా వాటిని ప్రభుత్వం ఆమోదించింది. రహదారులు ప్రమాదభరితంగా మారిన నేపథ్యంలో తమ పిల్లలను దూరంగా ఉన్న పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. ఆ విషయాన్ని అధికారులు ఖాతరు చేయకపోవడంతో తల్లిదండ్రులు తమ నిరసనను ప్రజాప్రతినిధులకు తెలియజేస్తున్నారు.

**విద్యకు ఖర్చు చేయడంలో తొలి నుంచీ వెనకడగే..**

విద్య, వైద్య రంగాలకు పెట్టే వ్యయాన్ని భారంగా భావించకూడదని, అది దేశ భవిష్యత్తును బలోపేతం చేసే వ్యయమని ఆర్థికవేత్తలు చెబుతుంటారు. కొఠారి కమిషన్ సూచనల ప్రకారం బడ్జెట్‌లో అందుకు తగిన నిధులు కేటాయించాలని విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడల్లా ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం వహించడం పరిపాటిగా జరుగుతోంది. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని అనేక పాఠశాలలు విలీన విధానంతో మూతపడ్డాయి. 2015లో కపిలేశ్వరపురం మండలంలోని కేదారిలంక గ్రామ శివారు చేరుగూడెం, నాగులచెరువు గ్రామ శివారు తోడుగుడ్లపాడు, కాలేరులోని బక్కివారి స్ట్రీట్ పాఠశాలలను మూసివేశారు. చేరుగూడెం పాఠశాల పిల్లల్ని వీధివారిలంక పాఠశాలలోనూ, తోడుగుట్లుపాడు పిల్లల్ని మాచర, కాలేరు పిల్లల్ని అదే గ్రామంలోని మరో ప్రాథమిక పాఠశాలలోనూ విలీనం చేశారు. అప్పట్లో తమ పిల్లలకు అన్యాయం చేయవద్దంటూ తల్లిదండ్రులు మొరపెట్టుకున్నా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఖాతరు చేయలేదు. చేరిగూడెం పిల్లలు వీధివారిలంకకు కాలినడకన రెండు కిలోమీటర్లు ప్రయాసకు గురవుతూ వెళ్లారు.

**ఇప్పుడూ అదే తంతు..**

టీకిలో 1993 నుంచి 1 నుంచి 5వ తరగతి వరకూ పాఠశాల నిర్వహిస్తున్నారు. పాఠశాల శిథిలస్థితికి చేరుకోవడంతో ఆ పాఠశాలను గతేడాది దగ్గర్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓ విభాగంలో నడిపారు. అలా చేయడం సౌకర్యంగానే ఉండటంతో తల్లిదండ్రులు సైతం సహకరించారు. ఉన్నట్టుండి ఆ తరగతులను గ్రామంలో బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు విలీనం చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బీసీ కాలనీకి వెళ్లాలంటే గ్రామ ప్రధాన రహదారి మీదుగా చిన్నారులు నడిచి వెళ్లాలి. కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపుల నుంచి కోరుమిల్లి మీదుగా టేకి ప్రధాన రహదారిలో భారీ ఇసుక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో తమ పిల్లలను బీసీ కాలనీలోని పాఠశాలకు పంపలేమంటూ తల్లిదండ్రులు మదన పడుతున్నారు. ఇదే విషయాన్ని గ్రామంలోని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. వారు విషయాన్ని ఎంఈఓ కె.తాతారావు దృష్టికి తీసుకెళ్లగా పాఠశాల విలీనం ప్రక్రియ ప్రభుత్వ నిర్ణయమని, తామేమీ చేయలేమన్నారు. దీంతో చేసేదేమీ లేక పిల్లల తల్లిదండ్రులంతా ఈనెల 20న కపిలేశ్వరపురం మండల సమావేశం వేదికకు వచ్చి తమ గోడును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎదుట మొరపెట్టుకున్నారు.

### ఎమ్మెల్సీ తోట ఆగ్రహం

కూటమి ప్రభుత్వం వచ్చాక కేదారిలంక యూపీ స్కూల్‌ని ప్రాథమిక పాఠశాల స్థాయికి తగ్గించింది. పాఠశాలలోని 6, 7, 8 తరగతులను పక్క మండలంలోని కొత్తపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు మ్యాపింగ్ చేశారు. లంక గ్రామం నుంచి కొత్తపేటకు తమ పిల్లలను సైకిళ్లపై పంపాలంటే తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారంటూ గ్రామ ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు మండల సమావేశంలో వాపోయారు. ఇలాంటి సమస్యలు అనేకం నియోజకవర్గంలో ఉన్నాయి. వీటిపై మండల సమావేశంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎంఈవో కె.తాతారావును వివరణ కోరగా తానేమీ చేయలేనని చెప్పారు. దూరంలోని పాఠశాలకు వెళ్లేటప్పుడు పిల్లలకు ప్రమాదం జరిగితే మీరు బాధ్యత వహిస్తారా అని ఎమ్మెల్సీ తోట ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆవేదనను ఉన్నతాధికారులకు నివేదించమని ఆదేశించారు. పిల్లలు భయపడుతున్నారని, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని, పిల్లలంతా రహదారులు మీదుగా దూరాన ఉన్న బడులకు వెళ్లడం ప్రమాదకరమన్న విషయాలతో జిల్లా విద్యాశాఖాధికారి నివేదిక పంపాలని సూచించారు. తన పరిధిలో ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని తల్లిదండ్రులకు ఎమ్మెల్సీ తోట భరోసా ఇచ్చారు.

### ఇసుక లారీలతో ప్రమాదం



టేకి ప్రధాన రహదారి మీదుగా రాత్రీపగలు ఇసుక ర్యాంపుల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ రహదారులపై తమ పిల్లలను బీసీ కాలనీ పాఠశాలకు పంపలేమని తల్లిదండ్రులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి మ్యాపింగ్ ప్రక్రియను నిలిపివేయాలి.

– ఉమ్మిడిశెట్టి వీరవేణి, ఎంపీటీసీ సభ్యురాలు, టేకి-1

### ప్రయాణ సదుపాయాలు లేవు



కేదారిలంక నుంచి కొత్తపేటకు వెళ్లడానికి ప్రయాణ సాధనాలు లేవు. సైకిళ్లపై చిన్నారులను రహదారులపై పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. యథావిధిగా ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలి.

– యర్రంశెట్టి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు, కేదారిలంక

# ప్రొటోకాల్‌కు తిలోదకాలు

- తీవ్ర అసంతృప్తిలో కౌన్సిలర్లు
- అధికారులు తీరుపై సర్వత్రా విమర్శలు


20వ తేదీన మున్సిపల్ చైర్ పర్సన్‌తో పాటు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

రామచంద్రపురం: ఎవరు ఏమనుకుంటే నాకేంటి నవ్విపోదురు గాక అన్నట్టుగా మారింది మున్సిపాలిటీ అధికారులు తీరు. స్వాక్షాత్తు మున్సిపల్ చైర్ పర్సన్ చాంబర్‌లోనే ప్రొటోకాల్‌కు తిలోదకాలిచ్చి అధికారిక కార్యక్రమాల్లో చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవితో పాటుగా కూటమికి చెందిన కౌన్సిలర్లకు మాత్రమే సమాచారం అందించడంపై మిగిలిన కౌన్సిలర్లు భగ్గుమంటున్నారు. కౌన్సిల్‌కు ఏ సంబంధమూ లేని వ్యక్తులతో చాంబర్‌లో అధికారిక కార్యక్రమాలను నిర్వహించటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రొటోకాల్‌కు తిలోదకాలిచ్చి కూటమి నేతల అడుగులకు మడుగులు ఒత్తుతున్న అధికారుల తీరుపై కౌన్సిలర్లు మండిపడుతున్నారు. మున్సిపాలిటీలో ఇటీవల జరుగుతున్న వ్యవహారాలు, అధికారులు వ్యవహార తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా కౌన్సిలర్లను పక్కన పెట్టి కూటమి నేతలతో అధికారిక ప్రారంభోత్సవాలు చేయటం, వంటి కార్యక్రమాలపై కౌన్సిల్ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. దీనికి తగ్గట్టుగా తాజాగా జరిగిన ఘటనపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 20న మున్సిపల్ చైర్ పర్సన్ చాంబర్‌లో మెప్మాకు చెందిన అధికారిక కార్యక్రమాన్ని మున్సిపాలిటీ, మెప్మా అధికారులు నిర్వహించారు. మున్సిపాలిటీకి సంబంధించిన కార్యక్రమం కావడంతో కౌన్సిల్ సభ్యులకు ఆహ్వానించాల్సిన అవసరం ఉంది. కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీకి చెందిన సభ్యులే అధికంగా ఉన్నారు. కేవలం చైర్‌పర్సన్‌ను మాత్రమే ఆహ్వానించి మెప్మాకు చెందిన రిసోర్సు పర్సన్లకు 35 మందికి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్‌కు సంబంధించి చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, జనసేన కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, టీడీపీ కౌన్సిలర్ పైడిమళ్ల సత్తిబాబు మాత్రమే పాల్గొన్నారు. కౌన్సిల్‌కు ఏ మాత్రం సంబంధం లేని కూటమి నేతలు పాల్గొని ట్యాబ్‌లు పంపిణీ చేయటంపై మిగిలిన కౌన్సిలర్లు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఇదే కార్యక్రమంపై అధికారులు కాకుండా తమకు కావాల్సిన వారిని ఒక కూటమి నేత ఫోన్లు చేసి పిలవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారిక కార్యక్రమాలను అందునా పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా నిర్వహించటం ప్రొటోకాల్‌కు విరుద్ధమని వారంటున్నారు. దీనిపై అధికారులు తీరును పలువురు కౌన్సిలర్లు తప్పుపడుతున్నారు. చైర్ పర్సన్ చాంబర్‌లో కేవలం చైర్‌పర్సన్‌కు మాత్రమే సమాచారం ఇవ్వటం అదే చాంబర్లో ఉండే వైస్ చైర్మన్‌కు కూడా కనీస సమాచారం ఇవ్వకపోవడం కూటమి నేతల అధికార దుర్వినియోగానికి అద్దంపడుతోందని కొందరు విమర్శిస్తున్నారు. కౌన్సిల్‌లో ఉన్న సభ్యులను కాకుండా కూటమి నేతలతో ట్యాబ్‌లను పంపిణీ చేయడంపై జిల్లా అధికారులను ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది.

### ప్రొటోకాల్ పట్టించుకోవడం లేదు



పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్, వైస్ చైర్మన్ల చాంబర్‌లో నిర్వహించే అధికారిక కార్యక్రమానికి నన్ను పిలవకపోవటం చాలా దారుణం. మున్సిపాలిటీ అధికారులు ప్రొటోకాల్‌కు తిలోదకాలిస్తున్నారు. కౌన్సిల్‌కు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులతో ట్యాబ్‌లు పంపిణీ చేయటం అధికారుల తీరుకు అద్దంపడుతోంది. ప్రొటోకాల్ ఉల్లంఘనపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– కోలమూరి శివాజీ, మున్సిపల్ వైస్ చైర్మన్

### కౌన్సిల్ సభ్యులకు సమాచారం ఇవ్వాలి



మున్సిపాలిటీలో నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు తప్పనిసరిగా కౌన్సిల్ సభ్యులకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అలా కాకుండా కౌన్సిల్ సభ్యులను కనీస సమాచారం ఇవ్వకుండా మెప్మాకు చెందిన ట్యాబ్‌లను చైర్ పర్సన్ చాంబర్‌లోనే కూటమి నేతల చేతుల మీదుగా పంపిణీ చేయటం ప్రొటోకాల్ ఉల్లంఘనే. దీనిపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలి.

– పెంటపాటి శ్రీను, వైఎస్ఆర్ సీపీ నేత మాజీ మున్సిపల్ కౌన్సిలర్

## మంత్రి పదవిని కాపాడుకునేందుకే జగన్‌పై విమర్శలు

వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



రామచంద్రపురం: ఎన్నికల ముందు వరకు రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌పై ఎన్ని కేసులు ఉన్నాయో అమలాపురం ప్రజలందరికీ తెలుసునని, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఆయనకు లేదని, కేవలం తన మంత్రి పదవిని కాపాడుకునేందుకే విమర్శలు చేస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ మండిపడ్డారు. పట్టణంలో గాంధీపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం మాట్లాడారు. మంత్రి సుభాష్ కేవలం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించేందుకు మాత్రమే ప్రెస్‌మీట్ పెడుతున్నారని, ఒక మంత్రి స్థాయిలో ఉండి జుగుప్సాకరమైన భాషతో ఆయన మాట్లాడిన తీరు దారుణంగా ఉందన్నారు. గతేడాది కాలంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని మంత్రి సుభాష్ ఏనాడూ చెప్పకుండా ముఖ్యమంత్రి ప్రాపకం కోసం కేవలం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించేందుకు మాత్రమే ప్రెస్‌మీట్ పెడుతున్నారని విమర్శించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 6న స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రుల పనితీరును వెల్లడిస్తే అందులో మంత్రి సుభాష్ పనితీరు 25వ స్థానంలో ఉందనే విషయం స్పష్టమైందన్నారు. అప్పటి నుంచి ఆయన తన మంత్రి పదవి ఎక్కడ ఊడిపోతుందనే భయంతో తన స్థాయిని మర్చిపోయి విలేకరుల సమావేశంలో వాడని భాషతో వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిపై, ప్రజల సంక్షేమంపై దృష్టి సారించకుండా వైఎస్సార్ సీపీ నేతలపై అదేపనిగా విమర్శలు చేస్తే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని సూర్యప్రకాశ్ అన్నారు.

## ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారించండి


పెమ్మిరెడ్డి మురళి

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న విమర్శలను చూస్తుంటే యోగా సాధన అత్యవసరంగా ఆయనకే అవసరముందనిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మంత్రి సుభాష్ మాట్లాడిన భాష, ఆయన హావభావాల అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తూ సమయాన్ని వృథా చేయకుండా, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించి మంత్రి సుభాష్ ప్రజలకు చేరువకావాలని హితవు పలికారు. ప్రెస్‌మీట్‌లో మంత్రి తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి పాలనపై ప్రజా వ్యతిరేకత ప్రారంభమైందని మురళి అన్నారు. ఇప్పటికైనా మంత్రి సుభాష్ తన భాషను, హావభావాలను మార్చుకోవాలని మురళి సూచించారు.

## జై ఆంధ్ర ఏపీ రాష్ట్ర సలహాదారుల సభ్యుడిగా ప్రసన్నకుమార్


సలాది ప్రసన్నకుమార్

కె.గంగవరం: జై ఆంధ్ర ఏపీ రాష్ట్ర సలహాదారుల సభ్యులుగా సత్యవాడకి చెందిన సలాది ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బీహెచ్ సుమిత్రానందన్ నుంచి ఆయన ఆదివారం ఉత్తర్వులు అందుకున్నారు. ప్రసన్నకుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూనే, సైబర్ సెక్యూరిటీ అడ్వైజర్‌గా, ఆర్టీఐ 2005 చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అందించిన సేలకు సలహాదారుల సభ్యుడిగా నియమించారని ప్రసన్నకుమార్ తెలిపారు.

## రోడ్డుకు ఇరువైపులా తుప్పలు..ప్రయాణానికి తిప్పలు


ఉండూరు వంతెన దిగువన రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు

కాజులూరు: కాకినాడ – కోటిపల్లి రహదారిలో ఉండూరు వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారి పొడవునా ఇరువైపులా ముళ్ల పొదలు, గడ్డి మొక్కలు పెరిగాయి. వంతెన దిగువలో మలుపునకు తోడు దట్టంగా పెరిగిన ముళ్ల పొదల కారణంగా దగ్గరకు వచ్చే వరకు ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒకదానికి ఒకటి కనిపించడం లేదు. దీంతో ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. మండల గ్రామాల చెందిన ప్రజలు నియోజకవర్గ కేంద్రమైన రామచంద్రపురానికి నియోజకవర్గంలోని ఇతర మండల గ్రామాల ప్రజలు కాకినాడ జిల్లా కేంద్రమైన కాకినాడకు వెళ్లాలంటే ఈ వంతెనపై నుంచి ప్రయాణం సాగించాల్సిందే. అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న పొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఆక్రమణలు తొలగించాలని వినతి


కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ అరుణ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ గ్రామ అభివృద్ధికి ఆటంకంగా ఉన్న గంటాంబికా దేవి ఆలయం నుంచి యానాం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వరకు గల (ఇరిగేషన్ ) పంట కాలువను, మురుగునీటి డ్రెయినేజీపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని కలెక్టర్‌కు ఈనెల 21న వినతి పత్రం అందజేసినట్టు ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ ఆదివారం తెలిపారు. ఇరిగేషన్ కాలువలు, డ్రెయిన్లను ఆక్రమించి నిర్మించిన కొందరు షాపులు ఏర్పాటు చేసుకుని టాయిలెట్లలోని వాడుక నీరు, ఇతర వ్యర్థాలను పంట కాలువలోకి వదిలేస్తున్నారని తెలిపారు. కొందరు ఆక్రమణ స్థలాలను సొంత ఆస్తులుగా భావించి వాటిని అద్దెకు ఇస్తున్నారని ఆమె పేర్కొన్నారు. షాపుల ముందు స్థలాలను తోపుడు బండ్లు, బడ్డీ వ్యాపారులకు రోజువారీ అద్దెకు ఇవ్వడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ముఖ్యంగా వెంకటాయపాలెం ఛానల్-2 ద్వారా పంటలకు సాగునీరు అందక సుమారు రెండు వందల ఎకరాలు పైగా సాగు చేస్తున్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ద్రాక్షారామ, తోటపేట రైతులు గతంలో జిల్లా కలెక్టర్‌కు పలు పర్యాయాలు ఈ సమస్యపై వినతులు అందజేశారని చెప్పారు. పంట కాలువలోని వ్యర్థాలను, పూడికను తొలగించేందుకు పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి సమస్యగా మారిందన్నారు. పంచాయతీ మార్కెట్ స్థలంలో వ్యాపారం చేసుకునే వారికి ఈ అక్రమ నిర్మాణాల కారణంగా సరుకుల రవాణాకు, వివిధ గ్రామాల నుంచి ద్రాక్షారామ వచ్చే కొనుగోలుదారులు, ప్రజలకు అసౌకర్యంగా ఉంటోందని తెలిపారు. దీంతో వ్యాపారాలు దెబ్బతిని పంచాయతీ ఆదాయానికి నష్టం ఏర్పడుతోందన్నారు. వెంకటాయపాలెం చానల్-2 నుంచి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా సప్త గోదావరికి (పుష్కరిణి) అభిషేక జలాలు చేరుతాయి. ఈ కలుషిత నీటిని చూసి భక్తులు ఆవేదన చెందుతున్నారన్నారు. పంచాయతీ పరిధిలోని ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధీనంలోని స్థలాల్లోని అక్రమణలు తొలగించిన తరువాత ద్రాక్షారామ పంచాయతీ మార్కెట్‌లోని ఖాళీ స్థలాల్లో పేదలకు వ్యాపారాలు చేసుకొనేందుకు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు సర్పంచ్ అరుణ తెలిపారు.

## శ్యాంప్రసాద్ ముఖర్జీ త్యాగం మరువలేనిది


కుయ్యేరులో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్ర పటాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

కాజులూరు: భారతదేశ సౌభాగ్యం కోసం జన సంఘ్ నేత, బీజేపీ ఫౌండర్ డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు మరువలేనివని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన త్యాగనిరతిని ప్రజలకు చాటి చెప్పాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఆదివారం కుయ్యేరులో మండల బీజేపీ అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ అధ్యక్షతన నిర్వహించిన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్ర పటాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజేష్, పర్యావరణ పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ సలాది వీరబాబు, వాసంశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

## ఈదురుగాలులకు కూలిన ధ్వజ స్తంభం

మామిడికుదురు: భారీ ఈదురుగాలుల ప్రభావానికి మామిడికుదురులోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ధ్వజస్తంభం కూలిపోయింది. ఆలయానికి భక్తులు వస్తుంటారు. కానీ శనివారం రాత్రి తొమ్మిది గంటలు దాటిన తర్వాత ఈ సంఘటన జరిగింది. ఆ సమయంలో ఆలయంలో అర్చకులతో సహా ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆలయం వెలుపల భారీ అభయాంజనేయస్వామి విగ్రహం ఉంది. ఆ విగ్రహం పక్కనే ధ్వజస్తంభం పడింది. దీంతో అక్కడ ఏ విధమైన నష్టం జరగకపోవడం విశేషం. సుమారు 11 ఏళ్ల క్రితం ఈ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారని ఆలయ అర్చకుడు చంద్రమౌళి భాస్కరం ఆదివారం తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి


ఆర్యావటంలో మార్కెట్ షెడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని ఆర్యావటంలో ఆదివారం మంత్రి సుభాష్ పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ముందుగా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 5 లక్షలతో నిర్మించిన మార్కెట్ షెడ్డు నిర్మాణానికి, రూ.12.80 లక్షలతో నిర్మించిన నాలుగు సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు, రూ.2.53 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్ నిర్మాణానికి, రూ.1.2 లక్షల వ్యయంతో నిర్మించిన అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ నిర్మాణానికి మంత్రి సుభాష్ ప్రారంభోత్సవం చేసారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, నియోజకవర్గ జనసేన కో ఆర్డినేటర్ పోలిశెట్టి చంద్రశేఖర్, ఎంపీటీసీ రాయుడు ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.